ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి ఎసరు

- మూడు త్రైమాసికాల బకాయిలు చెల్లించాలి
- విద్యార్థుల పక్షాన పోరాటానికి వైఎస్సార్‌సీపీ సిద్ధం
- 5న ఏలూరులో వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు
- పథకాల పేరు మార్పుపై ఉన్న ఉత్సాహం అమలులో లేదు
- ఉంగుటూరు నియోజకవర్గంలో రూ.106 కోట్ల బకాయిలు

డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు (ఫైల్)



నిడమర్రు: పేద విద్యార్థులకు ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థిక భరోసా కల్పించే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి కూటమి ప్రభుత్వం ఎసరు పెట్టినట్లు తెలుస్తోంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి షెడ్యూల్ ప్రకారం జగనన్న విద్యా దీవెనలో ఫీజులతో పాటు ఏడాదికి హాస్టల్, మెస్ ఖర్చులు వసతి దీవెనతో విద్యార్థుల ఖాతాల్లో పడేవి. వెంటనే కళాశాలలుకు చెల్లించేవారు. ఇప్పుడు పరిస్థితులు చూస్తుంటే మళ్లీ అప్పులు చేసి పిల్లలను చదివించుకోవాల్సిన దుస్థితి తప్పదని భయమేస్తోందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. గతం ప్రభుత్వంలో ఉన్నత చదువులు చదువుకునేందుకు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు షెడ్యూల్ ప్రకారం ప్రతి మూడు నెలకు విద్యార్థులకు అందేవి. ప్రస్తుతం మూడు త్రైమాసికాలు పూర్తవుతున్నా (9 నెలలు) ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం దారుణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఉంగుటూరు నియోజకవర్గంలోని సుమారు 14వేల మంది విద్యార్థులకు మూడు త్రైమాసికాలు కలిపి రూ.106 కోట్ల వరకూ ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉంది.

5న వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు

విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న ఏలూరులో వైఎస్సార్‌సీపీ ఫీజు కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ రోజు ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నట్లు జిల్లా పార్టీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ మేరకు అనుమతి ఇవ్వాలని జిల్లా అధికారులకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

విద్యారంగంలో పేరుకుపోయిన బకాయిలు

నియోజకవర్గంలో ఐదేళ్లపాటు నిశ్చింతగా ఉన్న ఉన్నత విద్యారంగం, కూటమి సర్కారు రాకతో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన భరోసాతో చదువుల్లో రాణిస్తున్న పేదింటి బిడ్డల్లో తీవ్ర ఆందోళన రేకెత్తుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.70 కోట్లు, వసతి ఖర్చులు రూ.36 కోట్లు బకాయిలు ఇంతవరకు విడుదల కాకపోవడంతో పిల్లల చదువుల పరిస్థితి గాలిలో దీపంలా మారింది. ఏ కళాశాల చూసినా ఫీజుల గోలే వినిపిస్తోంది. ఇంతకాలం ప్రతి మూడు నెలలకు ఒకసారి విడుదల చేస్తున్న ట్యూషన్ ఫీజుల చెల్లింపులు నిలిచిపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మరోవైపు ఇంటికి దూరంగా ఉంటూ ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయంతో (వసతి దీవెన) హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులపై ఒక్కసారిగా ఆర్థిక భారం పడింది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ హయాంలో అమలైన పథకాలకు పేర్లు మార్చిందే కానీ వాటి అమలు విస్మరించిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్‌గా మార్పు చేసింది.

పేద పిల్లల భవిష్యత్తుపై ప్రభావం



ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద మూడు త్రైమాసికాల నుంచి విద్యార్థులకు బకాయిలు చెల్లించకపోవడం దారుణం. ఇప్పటికే కళాశాలల ఒత్తిడి మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారు. డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లొమో కాలేజీ యాజమాన్యాలు పలువురు విద్యార్థులపై ఒత్తిడి తేవడంతో దిక్కు తోచని స్థితిలో ఫీజులు చెల్లించేందుకు విద్యార్థులు కూలి పనులకు వెళుతున్న సందర్భాలున్నాయి. దీంతో పేద పిల్లల చదువుపై తీవ్ర ప్రభావం పడుతోంది.

– నారపల్లి రమణారావు, సీపీఎం, జిల్లా కమిటీ సభ్యులు

విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా అనుమతివ్వాలి



పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారి పక్షాన వైఎస్సార్ సీపీ చేపట్టనున్న ఫీజు పోరుకు ఈనెల 5న ఉన్నత అధికారులు అనుమతినివ్వాలి. చంద్రబాబు సర్కారు అధికారంలోకి వచ్చాక మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాల పేర్లు మార్చడం తప్ప అమలును పట్టించుకోవడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసేవరకూ పోరాటం సాగుతుంది.

– కోడే కాశి, జెడ్పీటీసీ, నిడమర్రు

గత ఐదేళ్లలో జగనన్న విద్యా దీవెన లబ్ధి

మండలం	లబ్ధిదారులు	అందిన లబ్ధి
ఉంగుటూరు	4,618	రూ.116.25 కోట్లు
భీమడోలు	3,742	రూ.90.23 కోట్లు
నిడమర్రు	2,273	రూ.55,82 కోట్లు
గణపవరం	3,712	రూ.88.29 కోట్లు
మొత్తం	14,345	రూ.350,59 కోట్లు

ఐదేళ్లలో జగనన్న వసతి దీవెన లబ్ధి

ఉంగుటూరు	3760	రూ.57.45 కోట్లు
భీమడోలు	2901	రూ.42,20 కోట్లు
నిడమర్రు	1825	రూ.33.56 కోట్లు
గణపవరం	3238	రూ.49.06 కోట్లు
మొత్తం	11,724	రూ.182,27 కోట్లు

క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం



దాత సుబ్బారావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేరువేరుగా ఆదివారం రూ. 2,00,005 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా గణపవరంనకు చెందిన ఎస్వీ సుబ్బారావు రూ.లక్ష, తాళ్లముదునూరుపాడుకు చెందిన సత్తి శ్రీనివాసరెడ్డి రూ.1,00,005 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ తల్లి

పెదవేగి : భక్తుల పాలిట కల్పతరువు రాట్నాలమ్మకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో వేంచేసిన అమ్మవారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడం విదితమే. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల ద్వారా రూ.43,670, విరాళాలు రూ.24,183, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.21,000, ఫొటోల విక్రయం ద్వారా రూ. 4,345, మొత్తం రూ.93,198 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్ సతీష్‌కుమార్ తెలిపారు.

భీమడోలు రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తి



భీమడోలు రైల్వే ద్వారా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

భీమడోలు: జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న భీమడోలు రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తికావడంతో ఆదివారం సాయంత్రం నుంచి రైల్వే అధికారులు వాహనాల రాకపోకలకు అనుమతించారు. 10 రోజుల తర్వాత ఈ గేటు ద్వారా వాహనాల రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. గత నెల 22న ట్రాక్ అత్యవసర మరమ్మతు పనుల కారణంగా రైల్వే గేటును ఉన్నతాధికారులు మూసివేసారు. దీనితో రైల్వే శాఖ ఈ ట్రాక్ మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి గడువు సమయం కన్నా ఒక రోజు ముందుగానే పూర్తి చేసారు. అనంతరం ఈ గేటు ద్వారా వాహనాల రాకపోకలు సాగించేందుకు అనుమతిచ్చారు. దీనితో జిల్లా వ్యాప్తంగా భీమడోలు మీదుగా ద్వారకా తిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులు ఇబ్బందులు తీరాయి.

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన సీఐ, ఎస్సై

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి 68వ ఆలయ ఉత్సవ ఏర్పాట్లను ఆదివారం పెదవేగి సీఐ శ్రీనివాసరావు, దెందులూరు ఎస్సై శివాజీ పరిశీలించారు. ఫిబ్రవరి 4 నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు భక్తులు ఎంతమంది వస్తారు, మార్గాలు ఎన్ని ఉన్నాయి, తాగునీరు, పార్కింగ్, వైద్యం, మరుగుదొడ్ల ఏర్పాటును పరిశీలించారు. పోలీస్ పికెట్‌తో పాటు అన్ని ఏర్పాట్లు, సౌకర్యాలపై కమిటీ సభ్యులతో చర్చించారు.

అభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్

ఏలూరు (టూటౌన్): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఎనిమిదోసారి ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని రంగాల అభివృద్ధే ధ్యేయంగా ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దాన భాస్కర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఎన్డీఏ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని అన్నారు.

ముద్రగడ ఇంటిపై దాడి దుర్మార్గం

దెందులూరు: కాపు నేత, రాష్ట్ర మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇంటిపై దాడి దేనికి సంకేతమని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు దెందులూరు నియోజకవర్గం కాపు సంఘం అధ్యక్షుడు పోకల రాంబాబు, సీనియర్ నేత తోట పద్మారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన నివాసంలో మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం ఇంటి గేటును ట్రాక్టర్‌తో ఢీ కొట్టి, ఆవరణలోకి వెళ్లి ఆయన కారును సైతం ఢీ కొట్టారన్నారు. బెదిరింపులకు భయపడే వ్యక్తి ముద్రగడ పద్మనాభం కాదని పద్మారావు అన్నారు. దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. పోలీసులు విచారణ చేసి నిందితులను, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాపు సంఘం నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాపు ఉద్యమానికి ముద్రగడ కుటుంబం చేసిన సేవలు రాష్ట్రమంతా గుర్తుంచుకుంటుందన్నారు. కక్షపూరిత ధోరణితో దాడులు, దౌర్జన్యాలు చేయటం సిగ్గుచేటన్నారు. ముద్రగడ కుటుంబానికి తామంతా అండగా ఉంటామని పోకల రాంబాబు, తోట పద్మారావు అన్నారు.

'తాడేపల్లిగూడెం నుంచి అరుణాచలం' ప్రత్యేక ఆర్టీసీ బస్సు

ఉంగుటూరు: అరుణాచలం గిరి ప్రదక్షిణ ఈనెల 10న ప్రారంభం కానున్న నేపథ్యంలో పదవ తేదీ రాత్రి పది గంటలకు తాడేపల్లిగూడెం డిపో నుంచి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ పీఆర్వో బోసు తెలిపారు. బస్సు కాళహస్తి 11 ఉదయం చేరుకుంటుందని అక్కడ దర్శనం అనంతరం కాణిపాక విఘ్నేశ్వరస్వామి ఆయానికి చేరుకుని అక్కడ దర్శనం అనంతరం అదేరోజు రాత్రి శ్రీపురం మహాలక్ష్మి గోల్డెన్ టెంపుల్‌కు చేరుకుని అమ్మవారి దర్శనం అనంతరం 12వ తేదీ గురుపౌర్ణమి రోజున తెల్లారుజామున 2 గంటలకు అరుణాచలం చేరుతుందని తెలిపారు. అక్కడ గిరి ప్రదక్షిణ, స్వామి వారి దర్శనం అనంతరం బయలు దేరి 13న ఉదయం తాడేపల్లిగూడెం చేరుతుందని బోసు వివరించారు. బస్సు చార్జి రూ.2,600. రిజర్వేషన్ సౌకర్యం ఏర్పాటు చేశామని, ఆసక్తి కలిగిన ప్రయాణికులు 9959225488 లేదా 7382905856 నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.

ఆర్‌సీఎం చర్చిలో 23 జంటలకు వివాహాలు



23 జంటలకు వివాహాలు చేసిన ఫాదర్ అమ్మన్ రాజా

దెందులూరు: వివిధ కారణాల వల్ల పెళ్లి చేసుకోని 23 జంటలకు ఆదివారం దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ జి అమ్మన్ రాజా ఆధ్వర్యంలో క్రైస్తవ సంప్రదాయంలో వివాహాలు జరిపించారు. మేళ తాళాలతో డప్పులు వాయిద్యాల నడుమ 23 జంటలను ఆలయానికి తీసుకువచ్చారు. ఫాదర్ అమ్మన్ రాజా, ఫాదర్ కల్యాణ్ బాలరాజు నూతన దంపతులను ఆశీర్వదించారు. 23 జంటల వివాహాలకు చట్టబద్ధతను ఫాదర్ అమ్మన్ రాజా కల్పించారు.

ఎట్టకేలకు రహదారి మరమ్మతులు ప్రారంభం



భీమడోలు రైల్వే జంక్షన్ నుంచి గేటు వైపు రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న కూలీలు

భీమడోలు: రాష్ట్రీయ రహదారి భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. రెండు నెలల క్రితం నుంచి నిలిచిపోయిన పనులను కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత కాంట్రాక్టర్ తిరిగి పనులు చేపట్టారు. గతేడాది నవంబర్‌లో రహదారిపై ఏర్పడిన భారీ గోతులను పూడ్చేందుకు రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీనితో గుంతలు పూడ్చివేత కార్యక్రమాన్ని చేపట్టి డివైడర్‌లోని ఒకవైపు పనులు పూర్తి చేసారు. పూర్తయిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడం, రోడ్డు మరమ్మతుల పనుల నాణ్యతపై ఫిర్యాదులు అధికారులకు అందడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సాక్షిలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనితో ఆర్‌అండ్‌బీ రోడ్డును సంబంధిత ఉన్నతాధికారులు పరిశీలించారు. ఇదే తరుణంలో జిల్లాలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులు ఈనెల 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వీ ఆదేశించారు. దీనితో ఎట్టకేలకు రోడ్డు మరమ్మతులు తిరిగి చేపట్టారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ జే భాస్కర రావు వివరణ కోరగా కూలీల కొరత వల్లే రోడ్డు మరమ్మతులు పనులు నిలిచాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులను కాంట్రాక్టర్ చేపట్టారన్నారు. రెండు, మూడు రోజుల్లో గుంతలు పూడ్చే పనులు పూర్తవుతాయన్నారు.

ఆమంచి సుబ్బారావు మృతికి కొఠారు సంతాపం

దెందులూరు: విజయరాయి వైఎస్సార్‌సీపీ నేత ఆమంచి సుబ్బారావు ఆకస్మిక మరణం వ్యక్తిగతంగా, పార్టీ పరంగా తీరనిలోటు అని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో సుబ్బారావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. పార్టీకి ఆయన అందించిన సేవలు ఎనలేనివని అన్నారు. సుబ్బారావు ఆత్మకు శాంతి కలగాలని కోరతూ ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని అబ్బయ్య చౌదరి వివరించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఊరేగింపు



నారాయణపురంలో భూదేవి,శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

ఉంగుటూరు: నారాయణపురంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ ఊరేగింపులో మేళ తాళాలతో బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపు కొనసాగింది. ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఉత్సవ కమిటీ సభ్యులు ఊరేగింపులో పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



భీమడోలులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు

భీమడోలు: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ హలో మాదిగ చలో హైద్రరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈనెల 7వ తేదీ ఉదయం 11 గంటలకు లక్షల డప్పులు.. వేయి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లాల ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జి బయ్యారపు రాజేశ్వరరావు మాదిగ అన్నారు. భీమడోలు పంచాయతీ పరిధిలోని అరుంధతీ కాలనీలో ఆదివారం సాయంత్రం ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు కొత్తపల్లి చంద్రమౌళి అధ్యక్షతన సమావేశం వహించారు. ముఖ్య అతిథులుగా ఇన్‌చార్జి బయ్యారపు రాజేశ్వరరావు, జిల్లా నాయకులు మాముడూరి ఏలీయా మాదిగ, కాటూరి జోగేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. తొలుత వాల్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. నాయకులు దూలపల్లి రత్నకరాజు, భీమడోలు గాంధీ, కొత్తపల్లి వెంకటేష్, యంత్రపాటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి అవార్డు గ్రహీత జెస్సీకి సత్కారం



జెస్సీరాజును సత్కరిస్తున్న డాక్టర్ ఫాదర్ పీ బాల

దెందులూరు: రాష్ట్రపతి అవార్డు గ్రహీత జెస్సీరాజు ఆదివారం సోమవరప్పాడు సెయింట్ జాన్స్ విద్యా సంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పి బాల పూల కిరీటం, శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపకను అందజేశారు. జెస్సీలోని ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు స్కేటింగ్‌లో శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. స్కేటింగ్‌లో సాధించిన ఇంటర్నేషనల్ అవార్డుతో పాటు రాష్ట్రపతి అవార్డు, ప్రధానమంత్రి సంతకం చేసిన జ్ఞాపికను వికార్ జనరల్ డాక్టర్ బాలకు జెస్సీరాజు చూపించారు. జోగన్నపాలెం గ్రామాన్ని ఢిల్లీ స్థాయిలో ఇనుమడింపజేసి స్వగ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చావని, మరింత పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జెస్సీరాజ్‌కు ఫాదర్ సూచించారు.

సంక్షోభంలో ఆయిల్ పామ్ రైతులు

- గిట్టుబాటు ధర కోసం ఎదురుచూపు
- రైతు సంక్షేమం, అభివృద్ధి ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- పెదవేగి కర్మాగారం ప్రైవేటీకరణకు ప్రయత్నం



ఆయిల్ పామ్ గెలలు

దెందులూరు: ఆయిల్‌పామ్ రైతులు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. రూ.లక్షలు పంటలపై పెట్టుబడి పెట్టి గిట్టుబాటు ధర వస్తుందని గంపెడాశతో ఎదురు చూస్తున్న వేలాది మంది రైతన్న ఆశలపై కూటమి ప్రభుత్వం నిర్ణయం వ్యవసాయ అభివృద్ధి ప్రోత్సాహం సహాయం అనుసరిస్తున్న విధానంతో తీవ్ర నష్టాలను చూస్తున్నారు. ఒకవైపు రైతులకు పెద్ద పీట వేస్తామంటూనే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రైతు సంక్షేమం, అభివృద్ధి ఊసే ఎత్తటం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పూర్తవుతున్నా రెండవ పంట సైతం చేతికొస్తున్న తరుణంలో పంట సాయం గాలికి వదిలేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మాదిరిగా రైతులు, రైతు కూలీలను కౌలు రైతులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

21 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు

దెందులూరు నియోజకవర్గంలో వరి సాగు తర్వాత రెండవ అతిపెద్ద పంట ఆయిల్ పామ్ సాగును రైతులు చేస్తున్నారు. ఈ నియోజకవర్గ పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. 21 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోంది. 18,200 మంది రైతులు పైగా పంటను నమ్ముకుని లక్షల రూపాయలు పెట్టుబడి పెడుతున్నారు. గెల టన్ను ధర తెలంగాణ రాష్ట్రంలో కంటే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ ఉండటంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. టన్ను ఆయిల్ పామ్ ధర గల ఉత్పత్తికి రైతుకు రూ.18,000 ఖర్చు అవుతుంది. సెప్టెంబర్‌లో టన్ను గల ధర రూ.14,500 ఆగస్టులో ధర రూ.1,383 మాత్రమే రైతుకు ధర వచ్చింది. అక్టోబర్‌లో తెలంగాణలో ధర టన్నులు రూ.1,740 పలికింది. ఆయిల్ కంపెనీలు ఇష్టారాజ్యంగా తయారయ్యాయని రైతులు ఆరోపిస్తున్నారు.


రాష్ట్ర ప్రభుత్వ వైఖరి రైతుల పాటి శాపం

కోట్లలో లాభాల్లో ఉన్న పెదవేగి ఆయిల్ పామ్ కర్మాగారం ఉన్నప్పటికీ రైతులకు నష్టాలు తప్పడంలేదు. పామాయిల్ దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచినా రాష్ట్రంలో ఆయిల్ పామ్ గెలలకు ధర పెరగటం లేదని రైతులు చెబుతున్నారు. టన్ను ధర రూ.18,000 అమలయ్యేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గంలోని వేలాది మంది ఆయిల్‌పామ్ రైతులు కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో ఆయిల్‌పామ్ రైతులకు ఫ్యాక్టరీ నుంచి రవాణా చార్జీలు ఇప్పించాలని, ఫ్రూట్స్ తరలించిన వారం రోజుల్లోనే పేమెంట్ చెల్లించాలని రైతులు కోరుతున్నారు. ఆయిల్ పామ్ గెలల ధర నిర్ణయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి రైతులు నడ్డి విరిచేలా ఉందని పలువురు అంటున్నారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో సమానంగా ఆయిల్‌పామ్ గెలల ధరలను గత ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేసింది. ఆయిల్‌పామ్ సాగు పెరుగుదలకు, ఆయిల్ ఉత్పత్తికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేటీకరణకు స్వాగతం పలుకుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. ఏపీ ప్రభుత్వ వైఖరి కారణంగా ఆయిల్‌పామ్ రైతులకు తీవ్ర నష్టం కలుగుతోంది. దెందులూరు నియోజకవర్గంతో పాటు ఏలూరు జిల్లాలో ఏటా ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రైవేటు కంపెనీలైన గోద్రెజ్, నవభారత్ యాజమాన్యాలు ఫ్యాక్టరీలను ఇటీవల విస్తరింప చేస్తున్న సంగతి రైతులందరికీ తెలిసిందేనన్నారు. అందుకు విరుద్ధంగా రాష్ట్రప్రభుత్వం మాత్రం లాభాల్లోఉన్న ఆయిల్‌పామ్ కర్మాగారాన్ని మాత్రం ప్రైవేటీకరణ చేసేందుకు విశ్వప్రయత్నం చేస్తోందని ఈ ప్రయత్నాన్ని పూర్తి స్థాయిలో అడ్డుకుంటామని పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర మంజూరు చేసేందుకు పోరాటాన్ని ప్రణాళిక బద్ధంగా చేస్తామని రైతు నాయకులు చెబుతున్నారు.


రైతులు సంఘటితం కావాలి



రైతులందరూ సంఘటితం కావాలి. రైతు సమస్యలు పరిష్కారం ఏకైక మార్గం లక్ష్యంగా ఉద్యమించాలి ఆ రాజకీయాలకు అతీతంగా ప్రణాళిక ఉండాలి రాజకీయాలు పక్కన పెడితేనే పోరాటాలు విజయవంతం అవుతాయి. రైతుల పరిస్థితులన్నీ ఏకకాలంలో పరిష్కారమై సత్ఫలితాలు లభిస్తాయి.

– కే శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం నాయకులు

పెదవేగి కర్మాగారాన్ని అభివృద్ధి చేయాలి



దెందులూరు నియోజకవర్గంలో పెదవేగిలో ఉన్న ఆయిల్ పామ్ కర్మాగారాన్ని మరింత అభివృద్ధి చేయాలి. ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు అందించాల్సిన సబ్సిడీని ఇవ్వాలి రైతులకు మేలు జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్రస్థాయి పరిస్థితులు గుర్తించి నిర్ణయాలు తీసుకోవాలి. రైతుల సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా పథకాలు అమలు చేయాలి.

– ఇరుకులపాటి సాంబశివరావు, రైతాంగ సమాఖ్య రాష్ట్ర నాయకులు

అర్హులందరికీ ఇంటి స్థలం కేటాయించాలి

ఏలూరు (టూటౌన్): కూటమి నాయకులు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానం మేరకు తక్షణమే ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇళ్లు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ), ఏలూరు 2వ డివిజన్‌లో అడ్డగర్ల లక్ష్మీ ఇందిర ఆధ్వర్యంలో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ అర్జీల సమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడుస్తున్నా పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ఈ నెల 10న పూర్తి చేసిన అర్జీలను కలెక్టర్‌కు అందించే కార్యక్రమంలో లబ్దిదారులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఏలూరు జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.